నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 17 మార్చి 2025 | RANGAREDDY



తాండూరు : వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని తిమ్మాయిపల్లిలో నీళ్లు లేక ఎండిన వరి చేనులో మేస్తున్న పశువులు



కొడంగల్ : ఎండుతున్న జొన్న పంటను మేస్తున్న మేకలు

చేతికొచ్చిన పంట.. మేతకు..

ఎండిన పంటలు.. దిగాలులో రైతన్న

గతంలో రూ.5లక్షల వరకు ఆదాయం

గత బీఆర్ఎస్ పాలనలో ప్రతి సంవత్సరం అధిక పంట దిగుబడితో రూ.5లక్షల వరకు ఆదాయం వచ్చేది. మా కుటుంబానికి మొత్తంగా 3 ఎకరాల 20 గుంటల భూమి ఉంది. మా కుటుంబంలో అమ్మతోపాటు తమ్ముడు ఉన్నాడు. ముగ్గురం కలిసి వ్యవసాయం చేసుకొని సంవత్సరం పొడవునా వరి పంట సాగు చేస్తూ వస్తున్నాం. వర్షాకాలంలో వరి పంట సమృద్ధిగా వచ్చింది. ప్రస్తుత యాసంగిలో నీటి కొరత కారణంగా వేసుకున్న పంట చేతికి వచ్చే సమయంలో ఎండిపోతున్నది. అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టాం. గతేడాది మాదిరిగా ఈసారి కూడా అధిక దిగుబడి వస్తుందనే ఆశ ఉండేది. మొదట్లో పంట ఏపుగా పెరిగి ఉండటాన్ని చూసి చాలా సంతోషించా. తీరా పంట చేతికి వచ్చే సమయంలో పొలంలోని బోరులో నీటి నిల్వలు పూర్తిగా పడిపోయాయి. రూ.లక్ష వరకు పంట పెట్టుబడి పెట్టినా. ఏండ్ల కాలంగా వ్యవసాయం చేస్తున్నా.. ఇలాంటి పరిస్థితి ఏనాడూ చూడలేదు. యాసంగి సీజన్‌లో రైతులు అన్నింటా కష్టాలను ఎదుర్కొవాల్సి వస్తున్నది. దిగుబడి దేవుడెరుగు.. పెట్టిన పెట్టుబడి, తెచ్చిన అప్పులను కొంతైనా తీర్చుకోవచ్చనే ఆశ కూడా లేకుండా పోయింది. అప్పట్లో రైతు బంధు సాగు చేసే సమయానికి చేతికందేది, దాంతో అప్పు చేయకుండానే సాగు చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఎటువంటి ప్రభుత్వ సాయం అందడంలేదు. 10 సంవత్సరాల క్రితం బాధలను మళ్లీ చవిచూడాల్సి వస్తున్నది. ప్రభుత్వం రైతు కష్టాలను గుర్తించి నష్టాన్ని తీర్చేలా చర్యలు తీసుకోవాలి.

- అరుణ్‌కుమార్, రైతు, ఏర్పుమళ్ల

- వికారాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటడంతో వ్యవసాయ బోరు బావుల్లో ఇంకిపోయిన నీరు
- పంటలు చేతికందే దశలో కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్న రైతులు
- అప్పు చేసి కొత్తగా బోర్లు వేస్తున్నా ఫలితం కనిపించని వైనం
- అలవికాని హామీలిచ్చి అందరినీ ఆగం చేస్తున్న రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ హయాంలో పండుగలా పంట సాగు
- రైతు భరోసా రాక.. చేసిన అప్పులు తీర్చలేక కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు
- పలు గ్రామాల్లో నీళ్లు లేక పశువులకు మేతగా వరి, జొన్న చేన్లు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు

భూగర్భజలాలు అడుగంటడంతో వ్యవసాయ బోరుబావుల్లో నీరు ఇంకిపోతున్నది. దీంతో వరి పంట చేతికందే దశలో కాపాడుకునేందుకు అన్నదాతలు నానా తంటాలు పడుతున్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులకు పెట్టుబడి సాయం అందివ్వకపోవడంతో రూ.లక్షల్లో అప్పు చేసి కొత్తగా బోర్లు వేసుకున్నా ఫలితం ఉండడంలేదు. యాసంగి సీజన్‌లో బోరుబావుల కింద సాగుచేసిన పంటలు కొద్దిరోజుల్లోనే చేతికొస్తుందనుకున్న దశలో నీళ్లు పారకపోవడంతో ఎండిపోతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకున్న వరి చేను కళ్ల ముందే ఎండిపోతున్న రైతులు ఏమీ చేయలేకపోతున్నారు. దిక్కుతోచని స్థితిలో రైతులు పాడి ఆవులు, మేకలు, గొర్రెలను ఎండుతున్న వరి చేనులో మేపుతున్నారు. ఇందుకు సాక్ష్యం జిల్లాలోని పలు గ్రామాల్లో చేతికొచ్చిన పంటలు ఎండిపోవడంతో పశువులను మేపుతున్న దృశ్యాలే. ఇన్ని రోజుల నుంచి రాని కరువు ఇప్పుడే రావాలా అని రైతులు కంటతడి పెడుతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

- తాండూరు/కొడంగల్, మార్చి 16

నీళ్లు ఇంకిపాయె.. పంటలు ఎండిపాయె..

10 సంవత్సరాలకు ముందు వ్యవసాయం అంటే భయం వేసేది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను అందించి బాసటగా నిలిచారు. పంట సాగు సమయానికి రైతు బంధు వచ్చేది, ఎవరికీ చేయి చాపకుండా సంతోషంగా వ్యవసాయం చేసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎటువంటి మేలు చేయడంలేదు. ఈ సర్కారు వచ్చాకే కష్టాలు మొదలయ్యాయి. రైతు భరోసా ఇవ్వకపోవడంతో అప్పు చేసి పంట సాగు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రుణమాఫీ కూడా కాకపాయె. ఎట్లా సాగు చేసుకోవాలో అర్థం కావడం లేదు. చేసిన అప్పును తీరుస్తామా లేదా అనే భయం ఉన్నది. ప్రస్తుత యాసంగిలో ఒక ఎకరా 10 గుంటల్లో వరి పంట వేశా. నీళ్లు లేక వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో మళ్లీ అప్పు తెచ్చి రెండో పంటగా జొన్న పంటను సాగు చేశా. జొన్న పంట సాగు మధ్యలోనే ఉన్న బోరులో నీరింకిపోయింది. దీంతో జొన్న పంట మధ్యలోనే ఎండు దశకు చేరుకున్నది. రెండు పంటలకు మొత్తంగా రూ.లక్షా20వేలు ఖర్చు చేశా. కనీసం తాగడానికి, పశువులకు కూడా నీరందని పరిస్థితి ఏర్పడింది. నా భార్యతోపాటు నా కొడుకు, కోడలు వ్యవసాయం చేసుకునేవాళ్లం. కొడుకు చనిపోవడంతో కోడలు ముంబయికి వెళ్లింది. గతంలో ఎప్పుడు ఇంతస్థాయిలో కరువును చూడలేదు. ప్రభుత్వం రైతు కష్టాలను గుర్తించి ఆదుకోవాలి

– సోమ్లానాయక్, బోడబండతండా

నీళ్లు లేక.. దిక్కుతోచక..

ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతులకు ప్రస్తుతం కన్నీరే మిగులుతున్నది. ఇన్ని రోజుల నుంచి రాని కరువు ఇప్పుడే వచ్చింది. మా బతుకులను ఆగం చేస్తున్నది. మూడెకరాల పొలంలో వరి పంట వేశా. పంట చేతికివస్తుందన్న సమయంలోనే బోరు అడుగంటడంతో నీళ్లు రావడంలేదు. దీంతో దిక్కుతోచక 3 ఎకరాల వరి చేను పశువులకు మేతగా వదిలేశా. రూ.80 వేలు పెట్టి పంటసాగు చేసిన. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఇచ్చినట్టు కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదు. అప్పు తెచ్చి పంటలు వేసిన. ఇప్పుడు ఇలా పంట ఎండిపోవడంతో నాకేమీ తోచడంలేదు. ఏడిచి ఏడిచి కన్నీళ్లు కూడా రావడం లేదు. ఇలా నాతో పాటు అనేక మంది రైతులు గోసపడుతున్నారు. యాసంగి ప్రారంభమై మూడు నెలలు దాటిపోతున్నా రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం (రైతు భరోసా) ఇంకా అందడం లేదు. ఆ డబ్బులన్నా వస్తే కాస్త బాగుండేది. రాష్ట్రంలో రైతుల బాధలు తీరాలంటే ఒక్క కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమని మాకు ఇప్పుడు అర్థం అవుతున్నది. రేవంత్‌రెడ్డి నెరవేర్చని హామీలను ఇచ్చి ప్రజలందరినీ మోసం చేస్తున్నడు. పంట సాగు కోసం గతంలో కేసీఆర్ రైతుబంధు ఇచ్చినట్లే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.6 వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు రూ.12 వేలు ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటలేదు. కేసీఆర్ ఇచ్చిన రైతు బంధుతో వ్యవసాయం పండుగలా చేసుకున్నాం. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో చాలా ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలి.

- కుర్వ రాములు, రైతు, తిమ్మాయిపల్లి

'ఫ్యూచర్' అయోమయం

రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు కానున్న ఫ్యూచర్ సిటీ కోసం రేవంత్ సర్కారు పెద్ద ఎత్తున భూసేకరణకు తెరలేపింది. 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామని ప్రకటించిన ప్రభుత్వం అవసరమైన మరో 16వేల ఎకరాలను సేకరించేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నది. అందులో భాగంగానే ఇప్పటికే కందుకూరు మండలంలోని తిమ్మాయిపల్లిలో 366 ఎకరాలు, మహేశ్వరం మండలంలోని రావిర్యాలలో 277 ఎకరాల సేకరణకు గత బుధవారం కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. తాజాగా, ఆదివారం యాచారం మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలో 821 ఎకరాల భూసేకరణకు మరోసారి నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో ఇప్పటివరకు జిల్లాలో 1464 ఎకరాల భూములు సేకరించనున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్లను విడుదల చేసింది. రైతుల ప్రమేయం లేకుండానే నేరుగా ప్రభుత్వమే భూ సేకరణ కోసం నోటిఫికేషన్లు జారీ చేస్తుండడంతో అన్నదాతల్లో అలజడి మొదలైంది. పేపర్లలో వస్తున్న వార్తలు చూసేవరకు తమ భూములు పోతున్నాయన్న విషయం రైతులకు తెలియడంలేదు. కాగా, పలు గ్రామాల్లో గతంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో సేకరించిన భూములు కూడా ఫ్యూచర్ సిటీ కోసమే తీసుకుంటున్నారు. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ పరిధిలోని గ్రామాల్లో 7వేలకు పైగా ఎకరాలు తీసుకోవాలని ప్రభుత్వం గుర్తించింది. అందులో భాగంగానే కందుకూరు మండలంలోని తిమ్మాపూర్‌లో 600 ఎకరాలు, ఇదే మండలంలోని పంజాగూడలో 300 ఎకరాలు కూడా తీసుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ జారీచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. దీంతో ఫ్యూచర్ సిటీ పరిధిలోని గ్రామాల్లో ఎప్పుడు ఎవరి భూములు తీసుకుంటారో తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారు.

- రంగారెడ్డి, మార్చి 16 (నమస్తే తెలంగాణ)

- ఫ్యూచర్ సిటీ పేరుతో భూసేకరణకు తెరలేపిన రేవంత్ సర్కారు
- రైతుల ప్రమేయం లేకుండానే పలు గ్రామాల్లో 1464 ఎకరాల భూ సేకరణ కోసం నోటిఫికేషన్లు జారీ
- ఇప్పటికే ఫ్యూచర్ సిటీ పరిధిలోని గ్రామాల్లో 7వేలకు పైగా ఎకరాలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం
- కందుకూరు మండలంలోని తిమ్మాపూర్‌లో 600 ఎకరాలు, పంజాగూడలో 300 ఎకరాలు కూడా తీసుకునేందుకు నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు
- అన్నదాతలు, ప్రజల్లో మొదలైన అలజడి
- గతంలో టీజీఐఐసీ ఆధ్వర్యంలో సేకరించిన భూములు కూడా ఫ్యూచర్ సిటీ కోసమే..

ప్రభుత్వం తీసుకోవాలనుకుంటున్న మొండిగౌరెల్లి భూములు

మొండిగౌరెల్లి పరిస్థితి విచిత్రం..!

యాచారం మండలంలోని మొండిగౌరెల్లి గ్రామం పరిస్థితి విచిత్రంగా మారింది. ఈ గ్రామాన్ని ఫ్యూచర్ సిటీలోకి తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. కానీ, ప్రభుత్వం మాత్రం మొండిగౌరెల్లిని ఫ్యూచర్ సిటీలోకి తీసుకోకపోగా.. ఈ గ్రామంలో 821 ఎకరాల భూమిని తీసుకోవటం కోసం నోటిఫికేషన్ జారీ చేయడం గ్రామస్తులను విస్మయానికి గురిచేసింది. యాచారం మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 19 గ్రామపంచాయతీలను ఫ్యూచర్ సిటీలోకి తీసుకున్నారు. మిగిలిన 4 గ్రామాల్లో ఒకటైన మొండిగౌరెల్లిని ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన తమ భూములను తీసుకుంటున్నట్లు పేపర్లో వచ్చిన నోటిఫికేషన్ చూసి గ్రామస్తులు తీవ్రంగా ఆందోళనకు గురయ్యారు. అలాగే, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు వంటి మండలాల్లో కూడా పలు గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలన్న డిమాండ్ పెరుగుతున్నది.

ప్రాణాలు పణంగా పెట్టైనా..



పారిశ్రామిక ప్రగతి పేరుతో రేవంత్ సర్కారు చేపడుతున్న భూసేకరణలో ఎక్కువ మంది దళితులే నష్టపోతున్నారు. మొండిగౌరెల్లి గ్రామాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలని కోరితే స్పందించని ప్రభుత్వం గ్రామంలో ఉన్న 821 ఎకరాలను తీసుకోవాలనుకోవడం విడ్డూరంగా ఉన్నది. ఆ భూముల్లో దళితులు కొన్నేండ్లుగా వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. అలాంటి పేద రైతుల భూమిని ప్రభుత్వం కంపెనీల పేరుతో బలవంతంగా తీసుకునేందుకు ప్రయత్నాలు చేయడం దారుణం. దళితుల భూములను తీసుకోవడాన్ని నిలిపివేయకపోతే ప్రాణాలు అడ్డుపెట్టయినా పోరాడుతాం.

- బండిమీది కృష్ణ, మాజీ సర్పంచ్, మొండిగౌరెల్లి

నిర్ణయాన్ని మార్చుకోవాలి

పారిశ్రామిక ప్రగతి పేరుతో దళితులు, వెనుకబడిన వర్గాల భూములను లాక్కోవడం సరైంది కాదు. ఈ భూములను నమ్ముకుని ఎన్నో ఏండ్లుగా జీవిస్తున్నాం. పేదల భూములను లాక్కుని పెట్టుబడిదారులకు ఇవ్వాలనుకునే ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకోవాలి.

- అంజయ్యయాదవ్, మాజీ సర్పంచ్, మొండిగౌరెల్లి

దళితుల భూములను సేకరించొద్దు

కంపెనీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల భూములను తీసుకోవాలనుకోవడం మానుకోవాలి. ఎన్నో ఏండ్లుగా దళితులు ఆ భూములనే నమ్ముకుని జీవిస్తున్నారు. వారికి జీవనాధారమైన భూములను సర్కారు తీసుకుని వారిని రోడ్డుపాలు చేయవద్దు.

- రవీందర్, మొండిగౌరెల్లి

భూములు లాక్కుంటే రోడ్డున పడాల్సి వస్తుంది



ఎన్నో ఏండ్లుగా భూములను నమ్ముకుని జీవిస్తున్న వారి భూములను ప్రభుత్వం లాక్కోవాలనుకోవడం సరైంది కాదు. ప్రభుత్వం సేకరించాలనుకుంటున్న భూముల్లో అత్యధికంగా దళితులు, బడుగు బలహీన వర్గాల వారే ఉన్నారు. అలాంటి వారి భూములను తీసుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ఫ్యూచర్ సిటీలో తమ గ్రామాన్ని తీసుకోవాలని ఓవైపు కోరుతుండగా.. ఆ డిమాండ్‌ను పక్కనపెట్టి మా భూములను తీసుకోవాలనుకోవడం సరైంది కాదు.

- యాదగిరిరెడ్డి, రైతు, మొండిగౌరెల్లి



నందిగామ : ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

అప్పలపాలయ్యాం.. బిల్లులు ఇప్పించండి

ఎమ్మెల్సీకి నందిగామ మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

నందిగామ/కేశంపేట, మార్చి 16 : పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పెట్టి అప్పులపాలయ్యామని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే ఇప్పించాలని నందిగామ మండలంలోని పలు గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు ఆదివారం మొదళ్లగూడ గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన శాసనమండలిలో మీ సమస్యలపై మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అలాగే.. సీఐటీయూ ఆధ్వర్యంలో కేశంపేట మధ్యాహ్న భోజన కార్మికులు షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. బిల్లులను సకాలంలో చెల్లించకుంటే మార్చి 19న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 24న ఇందిరాపార్కు వద్ద మహా ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

బల్దియా ఉద్యోగులకు ఆరోగ్య భద్రత ఏదీ!

- హెల్త్ ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయని యంత్రాంగం
- అనారోగ్యం పాలవుతున్న ఉద్యోగులకు అవస్థలు
- ప్రీమియం కట్టకపోవడంతో రెన్యువల్ లేక అప్పులపాలవుతున్న బాధితులు
- ఆందోళనకు సిద్ధమవుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

సిటీబ్యూరో : జీహెచ్ఎంసీలో ఉద్యోగుల భద్రతకు భరోసా కల్పించడంలో యంత్రాంగం విఫలమైంది. సంస్థలో పని చేసే ఉద్యోగుల హెల్త్ ఇన్సూరెన్స్ గడువు ముగిసి నెల రోజులు కావొస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇటీవల ఓ శానిటేషన్ జవాన్‌కు గుండెపోటు రావడంతో స్థానిక హాస్పిటల్‌కి తరలించారు. 5 లక్షలు అవుతుందని హాస్పిటల్ యాజమాన్యం తేల్చి చెప్పడంతో డబ్బులు కట్టలేక, ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక ఆ కుటుంబం పడిన బాధలు అన్నీఇన్నీ కావు. గడిచిన నెల రోజులుగా వివిధ కారణాలతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మిగతా ఉద్యోగుల పరిస్థితి ఇలాగే ఉందని, సంబంధిత అధికారులు పట్టించుకుని హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో సరైన నిర్ణయం తీసుకుని కొత్త సంస్థకు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. వాస్తవంగా బజాజ్ హెల్త్ ఇన్సూరెన్స్ గడువు గత ఫిబ్రవరి 14తో ముగిసింది. జీహెచ్ఎంసీ నుంచి ప్రీమియం కట్టకపోవడంతో రెన్యువల్ కాలేదు. కొత్త హెల్త్ ఇన్సూరెన్స్ టెండర్లను పిలుస్తామని చెబుతున్నారే తప్ప..ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. అధికారుల కాలయాపనతో అనార్యోగానికి గురవుతున్న ఉద్యోగులకు హాస్పిటల్స్‌లో డబ్బులు కట్టలేక, వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2019 నుంచి హెల్త్ ఇన్సూరెన్స్..

2019 నుంచి జీహెచ్ఎంసీలో పనిచేసే ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారు. అంతకుముందు ఉద్యోగులు హాస్పిటల్లో జాయిన్ అయితే.. ఆ బిల్లులు తీసుకొచ్చి క్లెయిమ్ చేసుకునేవారు. బిల్లులు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. దీంతో ఉద్యోగులకు అప్పటి కమిషనర్ లోకేశ్‌కుమార్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకొచ్చారు. మొదట హెల్త్ ఇన్సూరెన్స్ మూడు లక్షల వరకు కవర్ అయ్యేది.. ఆ తర్వాత 5 లక్షల వరకు కవర్ అయ్యేలా చేశారు. ప్రస్తుతం బజాజ్ హెల్త్ ఇన్సూరెన్స్ సరిగా పనిచేయడం లేదని, కొన్ని హాస్పిటల్స్ అంగీకరించడం లేదని ఉద్యోగులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఉన్న ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ను పది లక్షలకు పెంచాలని అధికారులను కోరారు.

ఉద్యోగులు ఆసుపత్రి పాలు

ఇటీవల శానిటేషన్ జవాన్‌కు హార్ట్ ఎటాక్ రావడంతో ఖైరతాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో అడ్మిట్ చేశారు. నాలుగు స్టంట్స్ వేయాలని, ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుందని హాస్పిటల్ వర్గాలు శానిటేషన్ జవాన్ ఫ్యామిలీకి తెలిపారు. తమకు హెల్త్ ఇన్సూరెన్స్ ఉందని హాస్పిటల్ వారికి ఇస్తే.. ఇది ఎక్స్‌పైర్ అయింది కాబట్టి చెల్లదు.. మొత్తం డబ్బులు కడితేనే చికిత్స చేస్తామని చెప్పారు. దీంతో ఏం చేయాలో తెలియక అప్పు చేసి ఇబ్బందులు పడిన పరిస్థితి. ఇలా వరుసగా కమిషనర్, అడ్మిన్ అడిషనల్ కమిషనర్‌ని కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పెద్ద పెద్ద ఏజెన్సీలకు ఎలాంటి పనులు చేయకపోయినా బిల్లులు వెంటనే మంజూరు చేస్తారని, కానీ ఇలాంటి వాటిని మాత్రం ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణ ఆరోపించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల చెల్లింపులోనూ ఇబ్బందులే..

జీహెచ్ఎంసీలో 30 సర్కిళ్ల పరిధిలో అత్యవసర సేవలతో పాటు ఆదాయం వచ్చే టౌన్ ప్లానింగ్, ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్‌లు , ప్రకటనల విభాగంతోపాటు ఇతర విభాగాల్లో నాలుగు వేల మంది పర్మినెంట్ ఉద్యోగులుండగా ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిలో మరో 24 వేల మంది వివిధ రకాల విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఎక్కువ మందిని ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థలతో సమకూర్చుకుంటున్నారు. మరికొన్ని విభాగాల్లో విభాగాధిపతులు నేరుగా కాంట్రాక్ట్ సంస్థలను సంప్రదించి తమ అవసరాలకు అనుకూలంగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ఏజెన్సీలపై కమిషనర్ ఇలంబర్తి దృష్టికి ఈ అంశాన్ని పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీసుకువెళ్లగా .. కమిషనర్ స్పందించి విచారణకు ఆదేశించారు.